


# అమ్మ మనసు

విస్తట్లో తింటూ పుల్లలేరుకోవడం మనకు బాగా అలవాటైపోయింది.

అంతసేపూ ప్రభుత్వ అసమర్థతను ఎండగడ్తూ ఉపన్యాసాలిచ్చిన మేధావులు, వ్యక్తి దూషణలకు పాల్పడ్డ ఘనులు, శాపనార్థాలు పెట్టిన సామాన్యులూ తమ ఊళ్ళోకెళ్ళే బస్సురాగానే ఆదరా బాదరాగా ఎక్కేసి, హాయిగా రిలాక్సయ్యారు. సెవెన్ సీటర్‌లో కూచున్న ఉత్తములు కూడా ఆ ఆటో వాడ్ని బోడిమల్లయ్యను చేశారు ఉత్తర క్షణంలో.

ఇదంతా చూస్తున్న చంద్రం (చంద్రయ్య) మరోసారి నిట్టూర్చాడు. ఎన్.టీ. ఆర్. చౌరస్తాలో అరగంట నుండీ నిరీక్షిస్తున్నాడు. వాళ్ళ ఊరెళ్ళేందుకు బస్సుగాని, ఏ ఇతర ప్రైవేట్ వెహికిల్ గానీ రాలేదు.

'ఛ! ఈరోజుకిక ఊరికెళ్ళే యోగంలేదు కాని, తిరిగి సిటీ చేరుకోవడమే బెటర్. మరో పది నిముషాలు వెయిట్ చేసి, అదేపని చేయాలి. లేకుంటే మళ్ళీ హైదరాబాద్ చేరుకోవడం కష్టం. హైదరాబాద్ నుండి వికారాబాద్ వెళ్ళొచ్చుగాని, వికారాబాద్ నుండి ఆ పల్లెటూరికెళ్ళడమే మహాకష్టం.....

"నమస్తే సార్!" నవ్వుతూ పలకరించాడు రామకృష్ణ. ఆ నవ్వు డిస్టిల్డ్ వాటర్‌లా స్వచ్ఛంగా వుంది.

"హలో రామూ! బావున్నావా? అమ్మా...పిల్లలూ..." జనారణ్యంలో ఒంటరిగా కూర్చున్న చంద్రానికి ఓ మనిషి కనబడటం మహదానందాన్నిచ్చింది.

"బావున్నాం సార్! మీరు బాగున్నారా?"

"ఓ! ఫైన్!" నిజంగా సంతోషమే అతని గొంతులో; గుండెలో.

"అమ్మ దగ్గరి కెళ్తున్నారా?" మనసెరిగిన ప్రశ్న రామకృష్ణది.

వాళ్ళిద్దరిదీ వికారాబాద్‌లో ఎనిమిదేళ్ళ అనుబంధం. ఏడాది క్రితం చంద్రానికి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ కావడంతో సొంత ఊరికి దగ్గర్లోని ఆ టౌన్ని వదిలేయక తప్పలేదు. ఉన్న ఊరుతో పాటు కన్నతల్లీ దూరంకావడంతో ఆడపాదడపా అమ్మను పలకరించి రావడం అలవాటుగా మార్చుకున్నాడు. మిత్రులిద్దరికీ వాళ్ళ కుటుంబ వాతావరణమంతా పరస్పరావగాహన వుంది. రామకృష్ణ చంద్రం కంటె సుమారు పదేళ్లు చిన్నవాడు.

"చాలా రోజులైంది రామూ అమ్మని చూసి. తొందరగా వెళ్ళి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోదామంటే, గంటసేపట్నించీ బస్సేలేదు." నిరీక్షణ భారం అతని అరగంటని గంటగా మార్చేసింది మరి.

"మళ్ళీ ఇప్పుడే వెళ్తారా సార్? ఈ రోజుండి నేపు వెళ్ళలేరా?" క్యాజువల్ గానే రామకృష్ణ.

"ఎలా కుదుర్తుంది! అక్కడెన్ని పనులుంటాయ్...! ఏదో అసంతృప్తి అతని మాటల్ని బలహీనం చేసింది.

"కరెక్టే సార్!" సడెన్‌గా తన తప్పిదాన్ని గుర్తించాడు రాము. "అమ్మకన్ని సదుపాయాలూ చేశారా సార్?" అడిగాడు ఆ వెంటనే.

"ఒక్క టెలిఫోనే పెట్టించలేకపోయాను రామూ! మిగతావన్నీ అరేంజ్ చేశాను.

అదీ సాధ్యమయ్యేదే. దరిద్రులు ఊళ్ళో యూనిటీ లేదు. పట్టుమని పదిగడపల్లేవు, పన్నెండు పార్టీలు; ఇరవైనాలుగు గ్రూపులు. ఒకడు స్ట్రీట్ లైట్స్ పెడ్తే మరొకడు పగులగొడ్తాడు. ఒక పార్టీవాడు నల్లాలు పెట్టిస్తే మరో పార్టీవాడు పనిగట్టుకొని ట్యాపులు పీక్కెళ్తాడు. ఒక వర్గం రోడ్డు కాంట్రాక్టు సాంక్షన్ చేయించుకొస్తే మరో వర్గం ముందుకు సాగకుండా అడ్డుపుల్ల వేస్తారు. ఇంతకు మునుపు సర్పంచ్ చొరవ జూపడంతో బస్సురోజుకు నాలుగు సార్లు ఊళ్ళోకెళ్ళేది. ఇప్పుడున్న వీ.ఏ.ఓ. ఎగస్పార్టీవాడు ఆటోవాళ్ళని రెచ్చగొట్టి రోజుకు రెండు సార్లే బస్సు ఊళ్ళోకెళ్ళే పరిస్థితికి కారకుడయ్యాడు. వైర్‌లెస్ టెలిఫోన్ ప్లాంటుంది. బిల్లు కట్టడంలో నువ్వంటే నువ్వంటు మూడేళ్ళుగా దానికి మోక్షం లేకుండా చేస్తున్నారు. అక్కడ రోజూ అసెంబ్లీయే - పొడగిట్టదు. పోరు చావదు. ఇంకెలా బాగుపడ్తాం చెప్పు?" ఆవేశం అతడ్ని దాటి ఊరంతా తడిమేసింది.

"టీ.వీ. పెట్టించారా సార్!" నేటి ప్రధాన వినోద సాధనాన్ని గుర్తుచేస్తూ, మళ్ళీ ట్రాక్‌పైకి లాక్కొచ్చాడు చంద్రాన్ని రాము.

"ఆఁ....ఆఁ...పెట్టించాను." పాత టీవీ దిపేర్ చేయించి, అమ్మదగ్గర పెట్టించి, కొత్త కలర్ టీవీ కొన్న సంగతి చెప్పలేదు. "అమ్మకు ఇబ్బంది అవుతుందని ఇంట్లో అంతా షాబాద్ బండల ఫ్లోరింగ్ చేయించాను. ట్యాప్ పెట్టించాను....అమ్మ ఒక్కర్తీ ఇబ్బంది పడ్తుందని ఓ పనిపిల్లను తోడు చేశాను....

"మీరు చాలాగ్రేట్ సార్! ఈ కాలంలో కూడా అమ్మనింత గొప్పగా చూసుకునే వాళ్ళుంటారా?" అభిమానం నిండిన అభినందన-రాము.

"రామూ! ఇట్సవర్ మినిమమ్ రెస్పాన్సిబిలిటీ!" సహజంగానే చంద్రం భుజాలు ఉప్పొంగాయి.

ఇంతలోనే బస్సొచ్చేసింది.

* * *

"ఏంరా, సెందిరిగా! అంత బాగున్నార్రా?" బస్సు దిగగానే ఎదురైన బసిరెడ్డి పలకరించాడు.

క్రీస్తుపూర్వం మనిషిని చూసినట్టు ఎగాదిగా చూసి, మొహానికి అతకని నవ్వుని జోడించుకుంటూ "ఆ! బాగున్నం మామా!" అంటూ ఆగకుండా ముందుకు నడిచాడు.

'మా తాతలు నేతులు తాగారు, మా మూతులు వాసన చూడండి' అన్నట్టు, పల్లెటూళ్ళలో ఎప్పుడో అధికారాలూ, అజమాయిషీలూ వెలగబెట్టిన ఘనులు ఈనాడు గవ్వకు సాటిరానివారైనా, ఆ వాసనల్ని (కంపుని) ఇంకా విరజిమ్ము తున్నారు. అమాయకులూ, అనాగరికులూ భరిస్తారేమోగాని, తనలాంటి ఎడ్యుకేటెడ్‌కి ఎంత కంటకంగా ఉంటుంది?! వాళ్ళింట్లో యిప్పుడున్నారో లేదో గాని గాయిదోడ్ని(పాలేర్ని) పిలిచినట్టు "సెందిరిగా!" అంటూ పిలుస్తాడా! ఎంత సహ్యం?!....

ఎటో చూస్తూ, అసహనంగా నడుస్తున్న చంద్రం, అప్పుడే ఊళ్ళో కొస్తున్న పశువులేసిన పేడను చూసుకోలేదు.

"ఛ!" కసిగా, అసహ్యంగా విదిలించాడు కాలు.

"ఇది పల్లెటూరు సారూ! జెర్ర జూసుకోని నడువాలె. సీటీలలాక డాంబరు (తారు) రోడ్లుంటాయా? ముండ్లూ....రాళ్ళూ.... పెండా....అన్నీ ఉంటయ్."

ఉలిక్కిపడి తలెత్తాడు. ఎదురుగా అనంతయ్య; చిన్ననాటి తన క్లాస్‌మేట్.

బహుకుటుంబ భారాన్ని తలపిస్తూ, అతని తలమీద గడ్డిమోపు; తనే నిజమైన రక్షకుడన్నట్టుగా భుజం మీద గొడ్డలి; శాగదేరిన రంగుకు తోడు కండలు తిరిగిన శరీరం; 'రైతేరాజు' అన్న నానుడికి ప్రతీకగా అతను.

"ఏం సార్? గుర్తువట్టలే? నేను అనంతాన్ని!" గడ్డిమోపు నక్కడే పక్కనున్న గొడ్ల సావిడి దగ్గరేసేస్తూ, తల గుడ్డ తీసి బుర్ర గోక్కున్నాడు.

"రేయ్! నిన్ను గుర్తువట్టక పోవటమేందిరా? ఆ పిలుపేందిరా, 'సార్, పీర్' అంటూ?" అనంతయ్య భుజాలమీద చేతులేస్తూ ఆప్యాయంగా మందలించాడు చంద్రం.

"మరి నీవు నెక్కర్లేసుకోని, ముక్కు జీదేటప్పటి సెందురయ్యవు గాదు గదా! ఏ పొజీషన్‌కు ఆ పిలుపుండాలె." అమాయకత, స్వచ్ఛత ఎప్పటిలాగే అనంతయ్య మాటలు, మనసుకు అద్దాలు.

"నోర్మూయ్! నేను మిగతా అందరికీ సారును గావచ్చుగాని, నీక్కాదురా! నీకు నేనెప్పుడూ సెంద్రినే. నువ్వు నాకెప్పుడూ 'అనంతి'వే. చిన్నప్పుడు ఈ అనంతే సాయం చెయ్యకపోతే, ఈనాడీ చంద్రానికి అడ్రెసే ఉండేది కాదు." సడెన్‌గా బాల్యమిత్రులిద్దరి కళ్ళూ చిప్పిల్లాయి.

"చంద్రం! అది నీ మంచి మనసు ఎంత మందిట్లా గురుతుంచుకుంటరు?" కరిగిపోతూ మిత్రుని కళ్ళలోకి చూశాడు.

"హేయ్! నా అనంతి సంగతి నాకు దెలువదా?" బుగ్గమీద మెత్తగా పిడిగుద్దు గుద్దాడు-చంద్రం.

సరిగ్గా అలాగే అనంతం కూడా.

ఇద్దరూ ఆలింగనం చేసుకున్నారు గాఢంగా.

* * *

పార్వతమ్మ యింటి వసారాలో ముగ్గరూ పొయ్యిమొకిరెల్లాగా కూర్చున్నారు. యాభై పైబడ్డ వయసులో పార్వతమ్మ ముంగాళ్ళమీద, గోడ నానుకొని కూచుంది. ఆమెకు కొద్ది దూరంలో పనిపిల్ల శారద కాళ్ళు ముడుచుకొని కూచొని, కుడిచేయి మీద బరువుమోపింది. చంద్రం వాళ్ళిద్దరికి సమానమైన ఎడంలో, గుమ్మాని కెదురుగా ఓ ఫోల్డింగ్ చెయిర్‌లో కాళ్ళు చాచుకొని, బయలుదేరడానికి సిద్దంగా-

"ఏందివయా! వచ్చింది తడువేలేదు, పోతున్నావ్? "ఇంట్లోకి వస్తూనే మందలించాడు నరసయ్య. పొరుగిల్లు; వరసకి పార్వతమ్మకి తమ్ముడు.

గంభీరంగా ఉన్న నీటిలో అలల అలజడిలా ఏదో మార్పు. అయినా ఆ మార్పు మాటల్ని సంతరించుకునే సాహసం చేయలేదు.

ఇంట్లో జరిగిన చిన్న గొడవ అప్పుడే ఊరంతా పాకిపోయింది. అది సిటీ కాదుగదా, పక్కింట్లో జరిగిన విశేష సంఘటన సైతం టీ.వీ. చెబితేగాని తెలియక పోవడానికి.

"మరి యియ్యాల్లపూర్తికి ఉంటే ఏమాయెనోయ్?" మళ్ళీ తనే కదిలించాడు నర్సయ్య. రాజుకోని పొయ్యిని ఊదుతున్నట్టు.

"నేనేం ఉండుమనలేదు తమ్మీ, నీ కాలు మొకుత. ఇగ మల్ల రాకు నాయినా అంటున్న గంతే!" ఆ తల్లి కళ్ళలో నీళ్ళేకాదు. గుండెల్లో రక్తసంబంధం కూడా నిలిచిపోయిన వేదనకు ప్రతిస్పందనది.

"అదే మరి, మల్లరాగూడనంత తప్పు పని నేనేం జేసిన?" గుండె గొంతులో కొచ్చింది చంద్రానికి. ఎంతో ఆవేశంగా అనాలనుకున్న మాట, అతి కష్టం మీద గొంతు గడియని తోసుకొచ్చింది.

విషయమర్థమైంది నర్సయ్యకు.

"అరె, కన్నతల్లి మాటను తప్పు వద్దురురా? ఆయమ్మ బాధతోనన్నది. ఒగ పూట ఉండిపోతె అయిపాయె గద?!" నచ్చజెపుతూ నర్సయ్య.

"ఒద్దు బిడ్డా! ఒక్క పూటొద్దు. ఒక్క నిముసమొద్దు. నేను బండలాక బతుక నీకె అలువాటు వడ్డ. నీవు కండ్లల్లవడి ఎందుకు నన్ను గరిగిస్తవురా? కనిపిస్తే మల్ల పేగు గుంజుతది. పాణం గొట్టుకుంటది. వొద్దు రానీకెనీకు తిప్పలు; సూడనీకె నాకు తిప్పలు. మనుండంగ(బతికుండగా) మల్ల రానవుసురంలేదు. సచ్చిన్నాడు నీకు దయుంటె ఇంత మన్నువోసి పో...." ఆ మాట అర్జునుని బాణంలా పాతాళంలోని ఆమె కన్నీటిని చివ్వున పైకొచ్చేలా చేసింది.

చంద్రం కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

మెల్లగా రోదించ సాగింది శారద.

"ఏందక్కా! నీవు గూడ చిన్న పిల్లలాక గట్ల మొండిపట్టువడ్తె యెట్ల? వాడు పట్నంలుండేటోడు. ఎన్ని పనులుంటయ్? తీరికె దొరుకాలెనా?" మందలిస్తుంటే ప్రపంచం కళ్ళముందు కదిలింది నర్సయ్యకు.

"నీ కొడుకు శనా నయ్యమనుకో. నిన్ను ముద్దుగ జూసుకుంటున్నడు. అన్నీ మంచిగ అరుసుకుంటున్నడు. ఇల్లు మంచిగ జేపిచ్చిండు, నల్లవెట్టిచ్చిండు, గ్యాసు పొయ్యిగొనిపిచ్చిండు. నీకు కష్టంగాకుండ ఒగ పొల్ల(పిల్ల) ను గూడ జత జేసిండు. కన్నతల్లికోసురం గింతపూర్తికి జేసినోడెవ్వడున్నడు జెర జూపెట్టు."

"నా బిడ్డ కనికారమున్నోడు గనుకనే మనుసు దేవులాడుతున్నదిరా! వాడు అందరిలాక నన్ను బేఖాతర్ జేస్తే, నాకింత ఆరివారమెందుకుంటది? వానికి తీరని నాడు రానే లేదు. వొచ్చిన నాడన్నా ఒగ రోజుండి పోతే నా మనుసుకు తాత్పర్యంగాదా?" కన్నీళ్లు బెట్టు సడలించగా, సార్ద్రంగా అంది పార్వతమ్మ.

"సెందురయ్యా! అమ్మ గంత బతిమాల్తున్నది. ఒక్కరోజుండిపోరాదురా! కన్నతల్లి మనుసు కష్టపెట్టొద్దురా! డివిటికొగ రోజు సెలువ్ వెట్టుకో." అనునయించాడు నర్సయ్య.

తటపటాయించసాగాడు చంద్రం. ఒకపక్క తల్లి ఆవేదన. మరో పక్క ఇంటికెళ్ళక పోతే పెళ్ళాం నుండి ఎదురయ్యే వేదన. వేమన 'చెప్పులోని రాయి' ఎప్పుడూ ఆ సంసారంలో దొర్లుతూనే ఉంటుంది. ఆధునిక సమాజంలోని అనేకానేక భార్యాబాధితుల జాబితాలో అతనూ ఉన్నాడు మరి.

నిముషం పాటు మనసులో మల్లగుల్లాల అనంతరం... బ్యాగ్ తీసి, ఇంట్లో చిలుకొయ్యకు తగిలేశాడు. ఆ తల్లి ఆనందంతో కళ్ళ నీళ్లు తుడుచుకుంది.

* * *

ఆరాత్రి చంద్రయ్యకు సరిగ్గా నిద్ర పట్టలేదు. బయల్దేరే ముందు అమ్మ మాటలు, నర్సయ్య మాటలూ విని ఆగిపోతేనే మంచిదనుకున్నాడు. ఆగిపోయాక ఎందుకెళ్లలేక పోయానా అని బాధపడిపోసాగాడు.

పెళ్ళాం సంగతి సరే, పిల్లలిద్దరూ.... చిన్నవాడికి నాలుగేళ్ళు. వాడు జగ మొండి. పెద్దది నాలుగోతరగతి. తను తినందే తినదు. అదంటే తనకెంత ప్రేమో. తనంటే దానికంతకంటే ఎక్కువ. వస్తానని ఏడ్చింది కూడా. ఒంట్లో నలతగా ఉందని తీసుకురాలేదు. ఇప్పుడెలా ఉందో ఇంటిలచ్చి(గృహలక్ష్మి । భార్య) డాక్టరుకి చూయించిందో, లేదో. దానికెక్కువైతే...అంతటికీ తనే కారణమంటూ వేపుకునేందుకు మరింత మటీరియల్ అవుతుంది. పోనీ అపార్ట్‌మెంట్‌లోని ఇతరుల సహకారం....హుఁ! పేరుకే సంగమ్ అపార్టుమెంట్. చదరంగంలోని పావుల్లా ఎవరిదారి వాళ్ళదే.....

కలత నిద్రలో కలలు.....కలవరింతలూ అతడ్ని ఆ రాత్రంతా ఉక్కిరిబిక్కిరి చేస్తూనే ఉన్నాయి.

"చందూ!" తల్లి చల్లని స్పర్శతో ఉలిక్కి పడిలేచాడు.

"తెల్లవారుఝాము బస్సొచ్చే టైమయ్యింది నాయనా! ఇది దప్పితే మల్ల పొద్దుగూకిందాక బస్సులేదు. పిల్లలెదురు జూస్తుంటరు. బేగిలేసి తయారైపో!"

ఆశ్చర్యంగా కళ్ళునులుముకుంటూ చూశాడు చంద్రం. మూడ్రోజులైనా ఉండాలి, లేకపోతే మళ్ళీ రానక్కర్లేదంటూ నిన్న సాయంత్రం మూర్ఖంగా పట్టుబట్టిన ఆ అమ్మేనా ఈమె? ఇంతలోనే తన మనసులోని బాధను పసిగట్టేసిందా? తన పిచ్చిగాని తల్లి తనకర్థంగాక పోవచ్చుగాని, తనేంటో తల్లికి తెలీదా? ఇరవై నాలుగేళ్ళు ఆ ఒడిలోనే పెరిగాడు. ఆ స్పర్శ తను మరచిపోయినా, ఆమె మరచిపోతుందా? పట్టుమని పదేళ్ళ అనుబంధంలేని తన కూతురు కోసం కొట్టుకు చస్తున్నాడే, మరి ఆ తల్లి....."

"ఏందిరా! పోవా?" విచిత్రంగా చూసింది.

"ఊహూఁ!" అటు తిరిగి పడుకున్నాడు. నిన్న సాయంత్రం తల్లి చెమ్మగిల్లిన గుండెతో అన్నమాటలు గుర్తొచ్చాయి....

"ఔనురా! నాకన్నీ సదుపాయం జేసినవ్. కాదనలే. కాని, 'అమ్మా! నీ పాణమెట్లున్నదే.... కాళ్ళునొస్తున్నయ్యా....? కడుపు నొస్తున్నదా....? నాలికకేది మంచి గనిపిస్తున్నది....? అంటాని పేమతోని నీవు దెచ్చిన వొస్తువుల్ల ఏదన్నొకటి పలుకరిస్తాది బిడ్డా?" కన్నతల్లి పేగుల్లోంచి దూసుకొచ్చిన ఆ వాగ్బాణాలు గుండెను తొలిచేస్తుంటే మౌనంగా వత్తిగిల్లాడు చంద్రం.

బిడ్డ పరిస్థితి అర్థంగాక విలవిల్లాడసాగింది ఆ తల్లి మనసు.